స్వేచ్ఛ జెఏసి నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్వేచ్ఛ జెఏసి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో 'భారత రాజ్యాంగం – మనుస్మృతి సదస్సు అనంతరం ఇంటికి వెళ్తున్న సామాజిక ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అప్రజాస్వామికంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్వేచ్ఛ జెఏసి నాయకులను, ప్రజా సంఘాల నేతలను వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో శాంతియుతంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులను అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు.

స్వేచ్ఛ జెఏసి నాయకుల అక్రమ అరెస్టులను ఖండించండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని అంబేద్కర్ రీసోర్స్ సెంటర్‌లో భారత రాజ్యాంగం వర్సెస్ మనుస్మృతి సదస్సు ముగించుకుని తమ ఇళ్లకు వెళ్తున్న స్వేచ్ఛ జెఏసి నాయకులను అక్రమ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ తెలిపారు. అరెస్టు చేసిన ప్రజాసంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్‌తో సహా పలువురు స్వేచ్ఛా జెఏసి నేతలను అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ దగ్గరున్న అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహిస్తారనే అనుమానంతో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, జర్నలిస్టు సతీష్ చందర్, కవి జయరాజు, జూపాక సుభద్ర, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, జెఏసీ కన్వీనర్ టి.రమేష్, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్, బానాసా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదాం రాజు వంటి ప్రజాసంఘాల నేతలను అరెస్టు చేయడం దారుణమని పేర్కొన్నారు.

భగీరథా.. ఎన్నాండ్లీ వ్యథా..?

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదలైన తాగునీటి ఎద్దడి
- ఏజెన్సీ గ్రామాల్లో పనిచేయని మిషన్ భగీరథ పథకం
- వృథాగా ట్యాంకులు.. అలంకారంగా నల్లాలు
- తాగునీటికి అల్లాడుతున్న ఆదివాసీ గిరిజనులు
- కన్నెత్తి చూడని అధికారులు.. పట్టించుకోని ప్రజాప్రతినిధులు



ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో తాగునీటి తండ్లాట మొదలైంది. కొండలు, గుట్టలు ఎక్కి ఊరికి చేరిన మిషన్ భగీరథ పథకం పనిచేయడం లేదు. గిరి గ్రామాల్లో ఎక్కడ చూసినా భగీరథ ట్యాంకులు అందంగా కనిపిస్తున్నా.. వాటి ద్వారా నీటి సరఫరా మాత్రం జరగడం లేదు. ఈ పథకం పనిచేయకపోవడం.. అక్కడ ఉన్న చేతిపంపులు మూలకు పడిపోవడంతో ఆదివాసీ గిరిజనులు తాగునీటికి తండ్లాడుతున్నారు. ఊరికి దూరంగా.. చాలా భారంగా పనిచేస్తున్న చేతిపంపుల వద్ద గంటల తరబడి నిరీక్షించి తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. భగీరథ పథకం దరిచేరకపోవడం.. ఉన్న నీటి వనరులు పనిచేయకపోవడంతో గిరిజన గ్రామాలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ఏటా ఈ సమస్య ఉత్పన్నమవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని ఆయా పల్లెల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లాది నిధులు వెచ్చించి మిషన్ భగీరథ ట్యాంకులు, నీటి నిల్వ సంపులు నిర్మించినా ఫలితం లేకుండాపోతోంది. అనేక గ్రామాల్లో అలంకార ప్రాయంగా మారుతున్నాయి. ఏదో ఒక కారణంతో నెలల తరబడి తాగునీటి సరఫరా నిలిచిపోతోంది. నేరడిగొండ మండలం పీచరలో భగీరథ ట్యాంకులతో పాటు ఇంటింటికి నల్లాలు బిగించినా వాటి ద్వారా నీరు సరఫరా కావడం లేదు. ఇదే పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామంలోనైతే ఈ పథకం ప్రారంభించి రెండేండ్లు గడిచినా ఒక్కరోజు కూడా నల్లాల ద్వారా నీళ్లిచ్చిన దాఖలాలు లేవని గ్రామస్తులు చెబుతున్నారు. ఇలా అనేక ఆదివాసీ గిరిజన గ్రామాల్లో తాగునీటి దుస్థితి నెలకొంది. మరోపక్క గ్రామాల్లో ఇది వరకే వేసిన చేతిపంపులు కూడా మరమ్మతులు గురికావడం.. ఉన్న వాటి నుంచి నీళ్లు సక్రమంగా రాకపోవడంతో మనుషులతో పాటు గ్రామాల్లోని పశువులు నీటి కోసం తిప్పలు పడుతున్నాయి. ఏజెన్సీలోని అనేక గిరి గ్రామాల్లో ఎక్కడ చూసినా భగీరథ ట్యాంకులు..నీటిని నిల్వ చేసే సంపులు.. గ్రామాల్లో ఇంటి ముందర నల్లాలు కనిపిస్తున్నా వాటి ద్వారా నీరు సరఫరా కావడం గగనంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు..!

జిల్లాలోని అన్ని గ్రామాల్లో భగీరథ ట్యాంకులు నిర్మించి నల్లాలు బిగించడంతో అధికారులు భరోసాతో ఉన్నారు. అన్ని గ్రామాల్లో నీటి సరఫరా జరుగుతోందని.. ఎక్కడా నీటి సమస్య లేదని సభలు, సమావేశాల్లో చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అనేక గ్రామాల్లో నీటి సరఫరా కాకపోవడంతో గిరిజనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ అధికారులు మాత్రం అటువైపు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. ఆయా గ్రామాల ప్రజలు మండల స్థాయి అధికారులకు సమస్య విన్నవించినా వారు పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక చేతిపంపులు, స్థానికంగా ఉండే బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు సైతం ఆయా గ్రామాలకు వెళ్లకపోవడంతో సమస్య తెలియడం లేదు. ఎన్నికల సమయంలో తప్పితే.. మిగితా రోజుల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అటువైపు కన్నెత్తి చూడరనే విమర్శలు ఆయా గ్రామస్తుల నుంచి వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భగీరథ పథకం ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాల్లో చేతిపంపుల మరమ్మతులను పట్టించుకోవడం లేదు. గతంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఐటిడిఎ ద్వారా తాగునీటి అవసరాలకు నిధులు కేటాయించే ఈ శాఖలు కొన్నేండ్ల నుంచి వీటిని పూర్తిగా నిలుపుదల చేశాయి. దీంతో చాలా గ్రామాల్లో చేతిపంపులు పనిచేయకుండా మూలకుపడిపోయాయి.

చేతిపంపు నీటినే తాగుతున్నాం

– బైరి సోమేష్, పీచర, నేరడిగొండ మండలం

గ్రామంలో నిర్మించిన మిషన్ భగీరథ పథకం ప్రారంభమైన నాటి నుంచి నీళ్లు రావడం లేదు. ట్యాంకు, నీటి నిల్వ కోసం సంపు, ఇంటింటికి నల్లాలు బిగించినా ఉపయోగం లేకుండా పోతోంది. దాంతో గ్రామానికి చెందిన ఓ రైతు తన చేనులోని బోరు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మిగితా అవసరాల కోసం ఊరి చివరనున్న చేతిపంపు నుంచి తెచ్చుకుంటున్నాం. అధికారులు దృష్టిసారించి నీటి సరఫరా చేయాలి.

ఇప్పటి వరకు నీటి సరఫరా లేదు

– ఆడెం భీంరావు, గ్రామ పటేల్, లక్ష్మీపూర్

మా ఊరిలో మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించి రెండేండ్లు గడిచింది. ఇంటింటికి నల్లాలు కూడా బిగించారు. కానీ ఇప్పటి వరకు నీటి సరఫరా మాత్రం జరగడం లేదు. మూడు కాలాల పాటు గ్రామ చివరలో ఉన్న చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకుంటూ దాహం తీర్చుకుంటున్నాం. ప్రతి వేసవిలో తాగునీటికి గ్రామస్తులే కాకుండా పశువులు కూడా ఇబ్బందులు పడుతుంటాయి.



వారానికి ఐదు రోజుల పని దినాలు కల్పించాలి

- కనీస వేతనం రూ.26 వేలు చేయాలి
- 6న ఛలో లేబర్ కమిషనరేట్
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు వారానికి ఐదు రోజుల పని దినాలు చేయడంతో పాటు, రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు పట్టణంలో గల శ్రామిక భవన్‌లో ఆదివారం జరిగిన కిర్బీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలపరిమితి ముగిసిన జిఒలన్నింటిని వెంటనే సవరించాలని కోరారు. మోడీ ప్రభుత్వం కనీస వేతనం రూ.ఏడు వేలుగా ప్రతిపాదించడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రయివేటీకరణను వేగవంతం చేయడం దేశానికి ద్రోహం తప్ప వేరేది కాదన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులను చూస్తే...బిజెపికి కార్పొరేట్ల మేలు తప్ప వేరే ప్రజల బాగోగులు అవసరం లేదని రుజువైందని చెప్పారు. బడ్జెట్‌లో కనీస వేతనాల ఊసే లేకపోవడంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్, బీమా లాంటి వాటిమీద స్పష్టత ఏమాత్రం రాలేదని విమర్శించారు. స్కీమ్‌లకు బడ్జెట్ పెంపుదల లేదని, రవాణా చట్టం, విద్యుత్ చట్టం లాంటివి ఉపసంహరించుకుంటుందేమోనని ఎదురుచూసిన కార్మికులకు నిరాశే మిగిలిందన్నారు. రవాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు గురించి ఊసేలేదని తెలిపారు. కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ పై ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్మిక వర్గ సమస్యలు, కనీస వేతనాలకై మార్చి ఆరున నిర్వహించ తలపెట్టిన ఛలో లేబర్ కమిషన్ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లిఖార్జున్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె రాజయ్య, యూనియన్ జనరల్ సెక్రెటర్ వి ఎస్ రాజు, నాయకులూ శ్రీనివాస్, మల్లేశు, సుధాకర్, లకాన్, ఏడుకొండలు, ప్రభు, మహేశ్వర్ రెడ్డి, శంకర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ జెఏసి నాయకుల అరెస్టు అక్రమం

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్వేచ్ఛ జెఏసి నాయకులకు అక్రమంగా అరెస్టు చేశారని, ఇది అప్రజాస్వామక చర్య అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో 'భారత రాజ్యాంగం–మనుస్మృతి' అంశంపై జరిగిన సదస్సులో వారు పాల్గొన్నారని, సదస్సు అనంతరం ఇంటికి వెళుతున్న సామాజిక, ప్రజాసంఘాల నేతలను అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు సతీశ్‌చందర్, ప్రకృతి కవి జయరాజు, స్వేచ్ఛ జెఏసి కన్వీనర్ టి రమేశ్, జూపాక సుభద్ర, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బబు, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, నాసా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదాం రాజు తదితరులను అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారని తెలిపారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఖాదిర్ ఖాన్ చావుకు పోలీసులే కారణం

- వారిపై చర్యలు తీసుకోవాలి
- ఆ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి–ఆవాజ్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఖాదిర్‌ఖాన్ చావుకు పోలీసులే కారణమని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ పోలీసులు ఖాదిర్ ఖాన్‌పై చైన్ స్నాచింగ్ కేసు బనాయించి చిత్రహింసలకు గురిచేశారని పేర్కొన్నారు. దీంతో అతను చనిపోయారని తెలిపారు. దొంగతనంతో సంబంధం లేని వ్యక్తిని అరెస్టు చేసి హింసించడం అత్యంత దుర్మార్గమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖాదిర్ ఖాన్ కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చైన్ స్నాచింగ్ కేసులో అనుమానితుడిగా అతన్ని అరెస్టు చేశారని, నేరం ఒప్పించడం కోసం పోలీసులు తీవ్రంగా కొట్టడంతో చనిపోయాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారని తెలిపారు. వీపుమీద కమిలిన దెబ్బలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. నేరంతో ఖాదిర్ ఖాన్‌కు సంబంధం లేదని నిర్ధారణ అయ్యాక గుట్టుచప్పుడు కాకుండా వదిలేశారని తెలిపారు. కిడ్నీ ప్రాంతంలో తగిలిన దెబ్బల కారణంగా జనవరి ఐదున ఆస్పత్రిలో చేరారని, చికిత్స పొందుతూ ఖాదిర్‌ఖాన్ మృతి చెందాడని తెలిపారు. అతని మరణంతో భార్య ముగ్గురు పిల్లలు అనాథలయ్యారని పేర్కొన్నారు.

ఖాదీర్‌ఖాన్ చావుకు కారణమైన పోలీసులను కఠినంగా శిక్షించాలి : ఎఐవైఎఫ్

ఖాదీర్‌ఖాన్ చావుకు కారణమైన పోలీసులను కఠినంగా శిక్షించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లిఉల్లాఖాద్రీ, కె ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మెదక్ పోలీసులు ఖాదీర్ ఖాన్ పై చైన్ స్నాచింగ్ కేసు బనాయించి చిత్రహింసలకు గురిచేసి ఆయన చావుకు కారణమయ్యారని విమర్శించారు. ఈ ఘటనలో పోలీసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఖాదీర్ ఖాన్ కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

ఖదీర్ చివరి వీడియోను మరణ వాంగ్మూలంగా స్వీకరించాలి

- పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి ట్వీట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహ్మద్ ఖదీర్ చివరి వీడియో మరణ వాంగ్మూలంగా స్వీకరించాలని పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి కోరారు. ఐదురోజులపాటు పోలీసులు తీవ్రంగా కొట్టడంతో మరణించారని పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. తప్పును కప్పిపుచ్చుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దారుణమైన సంఘటన తనను కలిచివేస్తున్నదని తెలిపారు. మహ్మద్ ఖదీర్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వలతో.. రైతన్నకు గోదావరి నీళ్లు

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గోదావరి నీళ్లు తెచ్చి చేగుంట రైతన్నల కాళ్లు కడిగిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌దేనని మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల శివారులో కొండపోచమ్మ సాగర్ నుంచి కాల్వ ద్వారా ఆదివారం నీటి విడుదల కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, బంజారా నృత్యాలు, మహిళల బతుకమ్మ ఆట పాటలతో, యాదవుల ఒగ్గు కథలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి హరీశ్ రావు, మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డితో కలిసి గంగమ్మకు పూజలు నిర్వహించి, నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతన్నలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ప్రభుత్వం మీద నిందలు వేసి నట్టేట ముంచాలని చూస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాజెక్టులు కట్టి రైతులకు నీళ్లు ఇచ్చారని, ఉచిత కరెంటు, రైతు బంధు, ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే రైతు బీమా ద్వారా రూ. ఐదు లక్షలు ఇచ్చి ఆదుకుంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం, పత్తి కొనుగోళ్లలో సబ్సిడీ కోత పెట్టిందన్నారు. మెదక్ ఎంపి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సాగునీటి కాల్వలతో రైతన్నలతో పాటు పశువులకు, గొర్రెలకు, మేకలకు, ఈత చెట్లకు, ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజ్ శర్మ, ఎంపిపి మాసుల శ్రీనివాస్, జెడిపిటిసి శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్, జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రవీణ్ కుమార్, పిఎసిఎస్ సొసైటీ చైర్మెన్లు కొండల్ రెడ్డి, మేకల పరమేష్, వైస్ చైర్మెన్ పట్నం తనిషా, పిఆర్‌డిఇ నర్సింలు, సర్పంచులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు

- రాష్ట్ర మహిళా కమిషన్ సునీతా లక్ష్మారెడ్డి ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా పీరం చెరువు వద్ద దోపిడీ దొంగలు వివాహితను కిడ్నాప్ చేసి కారులో తిప్పుతూ లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని సైబరాబాద్ సిపి, కలెక్టర్‌ను ఆదేశించారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి రాష్ట్ర మహిళా కమిషన్‌కు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మహిళలకు సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో, పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 100, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ వాట్సప్ హెల్ప్ లైన్ నంబర్ 9490555533కి పిర్యాదు చేయాలని సూచించారు. బాధితురాలికి మహిళా కమిషన్, ప్రభుత్వం అండగా ఉంటాయని ఆమె తెలిపారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న ఇకలేరు

- షుగర్ లెవల్స్ పడిపోవడంతో ఆస్పత్రికి తరలింపు
- కార్డియాక్ అరెస్ట్‌తో మృతి
- ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక
- నివాళులర్పించిన సిఎం, మంత్రులు



సాయన్న భౌతికకాయాన్ని సందర్శిస్తున్న కెసిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే జి సాయన్న కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఆదివారం ఉదయం ఆకస్మికంగా షుగర్ లెవెల్ పడిపోవడంతో కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసియులో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కార్డియాక్ అరెస్ట్ రావడంతో మృతి చెందారు. ఆయన మృతికి నియోజకవర్గంలో అభిమానులు, కార్యకర్తలు శోక సంద్రంలో మునిగిపోయారు. కాగా, ఎమ్మెల్యే సాయన్న పార్థివదేహాన్ని కవాడిగూడ అశోక్‌నగర్‌లోని ఆయన నివాసానికి తీసుకురాగా, ముఖ్యమంత్రి కెసిఆర్ సందర్శించి నివాళ్లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నివాళ్లర్పించిన వారిలో మంత్రులు హరీశ్‌రావు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్ మాగంటి గోపీనాథ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ రావు ఉన్నారు. ఎమ్మెల్యే సాయన్నకు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. సోమవారం కార్ఖానాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన భౌతికకాయాన్ని ఉంచనున్నారు. అనంతరం బన్సిలాల్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు వెల్లడించారు.

ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపు

సాయన్న 1951 మార్చి 5న సాయన్న – భూదేవి దంపతులకు హైదరాబాద్‌లో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బి పూర్తి చేసిన ఆయన బ్యాంకులో పని చేశారు. కాలేజీ దశ నుంచి సాయన్నకు ఎన్‌టిఆర్ అంటే ఎంతో అభిమానం. దాంతో ఆయన తెలుగుదేశం పార్టీలో చేరి క్రియాశీలక పదవిలో పనిచేశారు. ఈ క్రమంలో అశోక్‌నగర్ నుంచి కార్పొరేటర్‌గా ఆయన పోటీ చేసి ఓటమి పాలయ్యారు, ఆ తర్వాత వరుసగా 1994, 1999, 2004 ఎన్నికల్లో ఆయన సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి టిడిపి తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే 2009లో కాంగ్రెస్ అభ్యర్థి పి శంకర్‌రావు చేతిలో ఓటమి చెందారు. అనంతరం 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడగా ఆయన టిడిపి నుంచి బరిలోకి దిగి మరోసారి గెలుపొందారు. 2015లో తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలకమండలి సభ్యుడిగా నియమితులయ్యారు. తర్వాత ఆయన బిఆర్ఎస్ పార్టీలో చేరి 2019లో ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఐదో సారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

అయితే 2019లో జరిగిన ఎన్నికల సమయంలో ప్రచారం చేస్తుండగా ఆయన కాలికి గాయాలు కావడంతో అప్పుడు షుగర్ లెవెల్ పెరగడంతో డాక్టర్లు ఓ కాలును తొలగించారు. అయినప్పటికీ సాయన్న అంగవైకల్యాలు మర్చిపోయి నియోజకవర్గ అభివృద్ధి కోసమే పాటుపడుతూ వచ్చారు. అలాగే సాయన్న హుడా డైరెక్టర్‌గా ఆరు సార్లు పనిచేశారు. కాగా ఆయన చిన్న కుమార్తె కవాడిగూడ కార్పొరేటర్‌గా పనిచేశారు. అయితే వచ్చే ఎన్నికల్లో కంటోన్మెంట్ టికెట్‌ను తన రెండో కుమార్తె నివేదికకు ఇవ్వాలని ఆయన సిఎం కెసిఆర్‌ను ఇటీవలే కలిసి కోరినట్టు తెలిసింది. అందుకు కెసిఆర్ నిరాకరించటంతో ఆయన తీవ్ర మనస్థాపానికి బిఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

తెలంగాణ గ్రామాలు చారిత్రాత్మక ఘటనలకు సాక్షిభూతం

- తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని ఏ గ్రామాన్ని తట్టిలేపినా ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు సాక్షిభూతంగా నిలుస్తాయనీ, ఆ చరిత్రలను రికార్డు చేసి భావితరాలకు అందించాల్సిన అవసరముందని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ నొక్కిచెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సాహిత్య అకాడమి కార్యాలయంలో సీనియర్ జర్నలిస్టు, రచయిత గుండెల రాజు రాసిన 'జంగిలిగొండ గ్రామ చరిత్ర' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ.. బైరాన్‌పల్లి నుంచి జనగాం వరకు, కడవెండి నుంచి జంగిలిగొండ వరకు మహోజ్వలమైన చరిత్ర కలిగి ఉందన్నారు. రాజు శాస్త్రీయపద్ధతిలో గ్రామాన్ని బాగా అధ్యయనం చేసి పుస్తకం రాసిన తీరు బాగుందని ప్రశంసించారు. తెలంగాణ బిసి కమిషన్ సభ్యులు ఉపేంద్ర మాట్లాడుతూ.. తాను పుట్టి పెరిగిన గ్రామ చరిత్రను భావితరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో రాజు చేసిన ప్రయత్నం బాగుందని అభినందించారు. సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్, ఓయూ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ జంగిలిగొండ వీరోచిత, సాంస్కృతి సాంప్రదాయ చరిత్రకు అనుగుణంగా 49 అంశాలపై లోతుగా అధ్యయనం చేసి గ్రామ చరిత్రను నిక్షిప్తం చేసిన తీరు అబ్బురపరిచిందన్నారు. .

పంట భూములపై 'రియల్' భూతం

- మాయమాటలతో రైతులను మభ్యపెడుతున్న వైనం
- తక్కువ ధరకు అసైన్డ్ భూముల కొనుగోళ్లు
- అధికారుల మాయాజాలంతో భూములకు పట్టాలు
- రైతుల నుంచి చేజారుతున్న వ్యవసాయ భూములు



ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పచ్చని పంట భూములను రియల్ భూతం పట్టి పీడిస్తోంది. పేద రైతులనే టార్గెట్ చేసింది. 'అసైన్డ్' పేరును అడ్డుపెట్టుకుని రైతుల భూములు కాజేసే కుట్రలు జరుగుతున్నాయి. గతంలో ఎన్నో పోరాటాల ఫలితంగా నాటి ప్రభుత్వాలు పేదలకు అసైన్డ్ భూములు పంచాయి. ఈ భూములకు పట్టాలు కూడా వచ్చాయి. గీ భూములనే నమ్ముకుని రైతులు బతుకుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అభివృద్ధి పనుల పేరుతో ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పుడు ఈ భూములపై రియల్టర్ల కన్ను పడింది. ప్రభుత్వం తీసుకోకముందే తమకు భూములు అమ్మాలని రైతులను మభ్యపెడుతున్నారు. ఈ అసైన్డ్ భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లాక అధికారుల చేతివాటంతో పట్టా భూములుగా మారుతున్నాయి. రియల్టర్లకు కోట్లు కురిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో రియల్టర్ల కబంధ హస్తాల్లో చిక్కిన సాగు భూములపై కథనం.

రంగారెడ్డి జిల్లాలోని ఆదిభట్ల రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 44/అ/1, 44/ఆ/1లో సుమారు 10 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఈ భూమిని రైతుల నుంచి రియల్టర్లు కొనుగోలు చేశారు. ఆ వెంటనే భూమి పట్టా చేసుకున్నారు. అసైన్డ్ భూమిగా రికార్డుల్లో చూపిన భూములకు సాధారణ పట్టాలు వచ్చాయి. కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 22/1లో 20 ఎకరాలు, 255/2లో 32 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. ఇందులో 30 మంది రైతులకు ఎకరా చొప్పున ప్రభుత్వం భూమి అసైన్డ్ చేసింది. 1989లో కొంత భూమి 22బి కింద ప్రభుత్వం తీసుకుంది. అయితే, ఈ భూములను సాగుచేస్తున్న రైతులకు గతంలో అసైన్డ్‌తో పట్టాలు ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల్లో ఈ సర్వే నెంబర్ల భూములు పేదలకు అసైన్డ్ చేసినట్టు చూపుతున్నాయి. అయితే, ధరణి పోర్టల్ వచ్చిన తరువాత కొత్త పాసు పుస్తకాలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇదే అదునుగా రాజకీయ పలుకుబడి, ప్రభుత్వ అండదండాలు ఉన్న రియల్ వ్యాపారులు రైతులకు నయానో.. భయానో ఇచ్చి ఈ భూములు కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారు.

షాబాద్ మండల పరిధిలోని చందనవల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వం పేదలకు అసైన్డ్ భూములు ఇచ్చింది. ఈ భూములను ప్రభుత్వం తిరిగి లాక్కుంటుందని తెలిసి రియల్ వ్యాపారులు రైతులను మభ్యపెట్టి ఎకరాకు రూ.20 లక్షల చొప్పన ఇచ్చి 25 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇక్కడ ఎకరా భూమి సుమారు రూ.మూడు కోట్లు ఉంది. ఇలా మొయినాబాద్, శంకర్‌పల్లి, అబ్దులాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్‌లో వందలాది ఎకరాల భూములను పేదల నుంచి తక్కువ ధరకు రియల్ వ్యాపారులు కొనుగోలు చేస్తూ రూ.కోట్లు గడిస్తున్న పరిస్థితి. ఈ తతంగం అంతా పాలక రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో జరుగుతుందన్న చర్చ జిల్లాలో జోరుగా వినిపిస్తోంది. రైతుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములు రియల్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లగానే పట్టాలుగా మారుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి పేదల భూములను రియల్టర్ల నుంచి కాపాడాలని, అసైన్డ్ భూములకు రైతులకే పట్టాలు ఇవ్వాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి

పేద రైతుల జీవనాధారం కోసం ఎన్నో పోరాటాల ఫలితంగా నాటి ప్రభుత్వాలు పేదలకు అసైన్డ్ భూములు ఇచ్చాయి. వాటికి పట్టాలు ఇవ్వాలి. అసైన్డ్ భూముల పేరుతో రైతుల నుంచి తక్కువ ధరకు భూములు కాజేస్తూ కోట్లు గడిస్తున్న రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

కాడిగళ్ల భాస్కర్– సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి

కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

- కార్మికుల స్థితిగతులపై సోయలేని పాలకులు
- ప్రధానితో పోరుకు కెసిఆర్ సిద్ధం కండి.. మేమూ మీ వెంట పయనిస్తాం
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య
- నేటి నుంచి పారిశ్రామిక కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో సర్వే



పాదయాత్ర కొనసాగిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ కార్మికులను మనుషులుగా చూడాలని, సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పాదయాత్రలో పాల్గొన్న వారికి ఆరోగ్య సమస్యలు వచ్చినా మొక్కవోని ధైర్యంతో గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారమే తమ లక్ష్యంగా పాలకుర్తి నుంచి పట్నం వరకు ముందుకు పోతుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య తెలిపారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ కూడిన బృందం చేపట్టిన పాదయాత్ర ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రానికి చేరుకుంది. రైల్వేస్టేషన్ నుంచి భువనగిరి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి బృందం సభ్యులు పూలమాలలేశారు. భువనగిరి మున్సిపల్ పరిధిలోని రాయగిరి, భువనగిరి పట్టణం, పగిడిపల్లి, బీబీనగర్ వరకు యాత్ర కొనసాగింది. అనంతరం దాసరి పాండు అధ్యక్షతన భువనగిరి వినాయక చౌరస్తా వద్ద జరిగిన సభలో వీరయ్య గ్రామ పంచాయతీ కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడారు.

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు పరిశుభ్రంగా ఉండాలన్న సోయి పాలకులకు లేదన్నారు. ఆధునిక రాకెట్, ఇంటర్నెట్ యుగంలో మనుషుల మధ్య కులం, మతం పేరిట విభేదాలు సృష్టిస్తున్నారని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచకుండా, పర్మినెంట్ చేయకుండా దాటవేస్తున్నారన్నారు. ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే ప్రజా అన్న ప్రధానమంత్రి మోడీకి పారిశుధ్య కార్మికుల వేతనంలో అంతరాలు ఉండకూడదనే జ్ఞానం లేదని విమర్శించారు. గుజరాత్‌లో మోడీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నడిరోడ్డు మీద ప్రజల గుడ్డలు విప్పినా నోరు మెదపలేదని ఆరోపించారు.

కార్మికులకు న్యాయం చేయలేని మోడీ ఉన్నా లేకున్నా ఒక్కటేనన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులకు రూ.300 ఉంటే నేడు రూ.8500 ఒక్కొక్క కార్మికులకు చెల్లిస్తున్నామని కెసిఆర్ చెప్పారన్నారు. ఇది ఆచరణలో అమలు కాలేదన్నారు. ఒక్కరికి రూ.8500 వేసి మిగతా వారిని పంచుకోమని చెప్తున్నారని తెలిపారు. సిపిఎం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కార్మికులకు రూ.8500 వేతనం అమలవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం చేసే పనులను చేయనీయకుండా చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాలకు వచ్చే ఆదాయం రాకుండా కేంద్రానికే నేరుగా ఆదాయం వచ్చేటట్టు చేశారని ఆరోపించారు. రాష్ట్రాలకు కేటాయించిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రధాని మోడీతో కొట్లాడటానికి సిద్ధమైతే కార్మికులందరూ మద్దతు పలకడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 28వ తేదీ వరకూ కొనసాగనున్న పాదయాత్ర ముగింపు లోపు ప్రభుత్వం స్పందించాలని, లేని యెడల ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా, ఈనెల 20 నుంచి మార్చి ఐదవ తేదీ వరకు రాష్ట్రంలో పారిశ్రామిక కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 12 ఏళ్ల కింద నిర్ణయించిన వేతనాలనే పారిశ్రామిక యాజమాన్యాలు నేటికీ అమలు చేయడం లేదన్నారు.

గ్రామ పంచాయతీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గ్యార పాండు, వెంకటయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్టుగా జిపి కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. జిఒ నెం 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వినోద్ కుమార్, మహేష్ పాదయాత్ర బృందం సభ్యులు, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, నాగర్‌కర్నూల్ జిల్లా నాయకులు బత్తిని వెంకటేశ్వర్లు, యం మల్లేశం, యూనియన్ జిల్లా అధ్యక్షులు బందెల భిక్షం తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ గ్రామ చరిత్రలు భవిష్యత్తు తరాలకు అందించాలి

ప్రజాశక్తి-కల్చరల్

తెలంగాణలో ప్రతి గ్రామానికి ఒక చరిత్ర ఉందని వాటిని నమోదుచేసి భవిష్యత్తు తరాలకు అందిసాల్సి ఉందని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ అన్నారు. బైరన్ పల్లి నుంచి జనగామ వరకు కడు వెండి నుండి జంగిలిగొండ వరకు ప్రతి గ్రామ చరిత్ర గ్రంథస్తం కావాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. తెలంగాణ సాహిత్య అకాడెమీ కార్యాలయంలో రచయిత గుండెల రాజు రచించిన మహబూబాద్ జిల్లా జంగిలిగొండ గ్రామ చరిత్ర సంపుటిని అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ అవిష్కరించి మాట్లాడారు. రాజు జర్నలిస్ట్ కావటం వల్ల చరిత్ర రచనకు సమాచారం అవసరమో అవి సేకరించి అందించారని అభినందించారు. తెలంగాణా మాలి దశ ఉద్యమ సమయంలో మాను కోట వద్ద జరిగిన రాళ్ల దాడిలో గుండెల రాజు గాయపడ్డారని కెసిఆర్ పరామర్శించి ధైర్యం చెప్పిన సందర్భాన్ని గుర్తు చేశారు. బిసి కమిషన్ సభ్యుడు ఉపేంద్ర మాట్లాడుతూ రాజు రెండేళ్ల పరిశోధన కృషి గ్రంథంలో కనిపిస్తుందని వివరించారు. సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్ కొండ నాగేశ్వరరావు పాల్గొన్న సభలో గుండెల రాజు తాను రచనకు తోర్పడిన అంశాలు తెలిపారు.

తల్లి తనయల నాట్య విన్యాసం నయన మనోహరం

ప్రజాశక్తి-కల్చరల్



అమెరికాలో స్థిరపడి లాస్ ఏంజెల్స్‌లో నృత్యశిక్షణా సంస్థ సావిత్రి ఆర్ట్స్ అకాడెమీ స్థాపించిన డాక్టర్ సింధూరి కుమార్తె వినయనిల కూచిపూడి, భరత నాట్యం, కథక్ శైలిలలో నర్తించి పేక్షకులను ముగ్ధుల చేశారు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కళామందిరంలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వహణలో తొలి అంశం వినయని గణపతి స్తుతితో నాట్య ప్రదర్శన అరభించారు. డాక్టర్ సింధూరి శివ పదంను భరత నాట్య శైలిలో పద ముద్రలలో నైపుణ్యాన్ని అభివ్యక్తీకరణలో మెలుకువలతో నర్తించి ప్రేక్షకుల ప్రశంస పొందారు. వినయని సిద్ధేంద్ర యోగి విరచిత భామా కలాపంలోని ప్రవేశ దరువు భామనే సత్య భామనే అంటూ హెయలు కులుకులు, పొగరులను అభిన ఇస్తూ నర్తించి కను విందుచేశారు. నట్టువంగం పులకేసి కస్తూరి చేయగా, పుస్తకం కమల గానం చేశారు. మృదంగం పై శ్రీధరాచార్య, వేణువుపై జయరాం, తబలపై వారిజిత్ సింగ్ సహకరించారు.

గిరిజనేతరుల సంగతేంటి?

- చట్ట సవరణపై కేంద్రం తాత్సారం..
- 75 ఏళ్ల' గుర్తింపే సమస్య అంటున్న గిరిజన శాఖ
- అర్హత కలిగిన అందరికీ హక్కుపత్రాలకోసం ఆందోళన
- తిరస్కరించినవి పున:పరిశీలించాలనే డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పోడు భూముల హక్కు పత్రాల కోసం సాగుదారులు ఏండ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల చివరినాటికి అర్హత కలిగిన అందరికీ హక్కుపత్రాలిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైనట్టు తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 4,14,353 లక్షల మంది నుంచి 12,46,846 లక్షల ఎకరాల అటవీ భూముల కోసం అర్జీలు అందాయి. కొన్ని చోట్ల ఎలాంటి సర్వేలు చేయకుండానే దరఖాస్తులను తిరస్కరించారన్న విమర్శలు లేకపోలేదు. మరి కొన్ని చోట్ల కనీసం గ్రామ సభలూ నిర్వహించలేదన్న ఆరోపణలు సైతం వస్తున్నాయి. రకరకాల కొర్రీలతో దరఖాస్తులను తిరస్కరించినట్టు తెలుస్తున్నది. అలాంటి దరఖాస్తులను పున:పరిశీలించాలని వారు కోరుతున్నారు. ఇందులో గిరిజనులు, గిరిజనేతరులూ ఉన్నారు.

మూడు తరాల రుజువు సమస్య..

2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 డిసెంబరు 13 ముందు వరకు సాగులో ఉన్న గిరిజనులకు పత్రాలు ఇవ్వాల్సి ఉంది. గిరిజనేతరులకూ ఇదే చట్టం ప్రకారం 75 ఏళ్ల నుంచి అంటే మూడు తరాల నుంచి సాగులో ఉన్నట్టు రుజువు ఉంటే హక్కు పత్రాలివ్వొచ్చని నిబంధన ఉంది. ఇదే ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారిందని అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే గిరిజనేతరులకు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా హక్కుపత్రాలు ఇవ్వొచ్చని వారు చెబుతున్నారు. ప్రస్తుత పరిశీలన ప్రకారం చూస్తే- గిరిజనులకే హక్కు పత్రాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్టు సమాచారం. దీంతో గిరిజనేతరుల్లో ఆందోళన మొదలైంది. తరతరాలుగా ఇక్కడే బతుకుతున్నామంటూ ..ఇప్పుడు హక్కుపత్రాలు ఇవ్వబోమంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల గిరిజనేతరుల అంశం ఎటూ తేలకపోవడంతో అధికార పార్టీ నేతల్లో సైతం ఆందోళన మొదలైంది. పరిశీలనలో తిరస్కరణకు గురవుతున్న దరఖాస్తులో అధికంగా గిరిజనేతరులవే ఉన్నట్టు సమాచారం. 75 ఏళ్ల రుజువు కలిగిన గిరిజనేతరులు అతి తక్కువ మంది తేలడం గమనార్హం! ఈ నిర్ధారణా శాస్త్రీయంగా లేదనే విమర్శలున్నాయి. శాటిలైట్ సర్వే గాకుండా..గ్రామ సభలద్వారా గిరిజనేతరుల్లో అర్హులను గుర్తించి, చట్ట ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని ఇప్పటికే ఆదివాసీ, అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో పోడు పత్రాలపై గిరిజన శాఖ తర్జనబర్జన పడుతోంది. గిరిజనులందరికీ హక్కుపత్రాలిస్తామని సర్కారు ప్రకటించినప్పటి నుంచి గిరిజనేతరుల అంశంపై తీవ్ర చర్చ సాగుతుంది.

సమస్యపై కేంద్రానికి లేఖ..

గిరిజనులకు పోడు హక్కు పత్రాలు ఇవ్వడంపై 2006 అటవీ హక్కు చట్టంలో స్పష్టమైన వివరాలు ఉండడంతో ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ, గిరిజనేతరులకు ఇచ్చే అంశం మాత్రం 75 ఏళ్ల రుజువుకు ముడిపడి ఉండడంతో ముందుకెళ్లలేకపోతున్నారు. పోడు భూములు, ఇతర అంశాలు మొత్తం కేంద్రం పరిధిలో ఉండటంతో 75 ఏళ్ల గుర్తింపు అంటే ఇబ్బంది అవుతోందని.. దీనిపై కొంత సడలింపు కావాలని కోరుతూ గిరిజన శాఖ కేంద్రానికి ఏడాది క్రితమే లేఖ రాసినట్టు తెలిసింది. కనీసం కటాఫ్ తేదీని 2018 వరకు పొడిగించాలని కోరినట్టు సమాచారం. అయితే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర తాత్సారం చేస్తున్నదని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి.

జిల్లా స్థాయి కమిటీలకు దరఖాస్తులు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజనుల్లో అర్హులైన వారికి పోడు హక్కు పత్రాలు అందించేందుకు ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తులు గ్రామస్థాయి నుంచి సబ్ డివిజనల్ స్థాయిలో పరిశీలన పూర్తిచేసుకుని జిల్లా కమిటీలకు చేరాయి. ఈ కమిటీల్లో మరోసారి పరిశీలన జరగనుంది. ఇక్కడ తిరస్కరించిన దరఖాస్తులను తిరిగి గ్రామస్థాయికి పంపనున్నారు. ఎందుకు తిరస్కరించారన్న వివరాలను దరఖాస్తుదారులకు తెలియజేయాల్సి ఉంది. అనంతరం వారు మళ్లీ అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది.

తక్షణం హక్కు పత్రాలివ్వాలి - ఆర్ శ్రీరాంనాయక్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గిరిజన సంఘం

పోడు సాగుదారులందరికీ తక్షణమే హక్కుపత్రాలు ఇవ్వాలి. హక్కు పత్రాలు లేకపోవటంతో రైతు బంధు, బీమా తదితర సౌకర్యాలకు దూరమయ్యారు. చట్టంలో ఉన్న ప్రకారం గిరిజనేతరులకు కూడా హక్కు పత్రాలివ్వాలి. రకరకాల నియమాల పేరుతో వాటిని నిరాకరించటం సరికాదు. అటవీ హక్కుల గుర్తింపు చట్టంలో రెండు సవరణలు చేయాలని ఆరు నెల్ల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం..కేంద్రానికి లేఖ రాసింది. దానిపై కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేయటం పోడు రైతులపై ఆ సర్కారుకున్న ప్రేమ ఏపాటిదో తెలియజేస్తున్నది. దీంతో వేలాది మంది గిరిజనేతరులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలి. లేదంటే ఉద్యమాలు తప్పవు.

జాతీయ స్థాయిలో బిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

- ఎంపి ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిల సంక్షేమం కోసం జాతీయస్థాయిలో ప్రత్యేక బిసి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీకి ఆదివారం ఆయన లేఖ రాశారు. జనాభాలో 56 శాతంగా ఉన్న బిసిలకు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం అత్యంతదారుణమన్నారు. మంత్రిత్వ శాఖ లేకపోవడంతో బిసిలు విద్యా, ఆర్థిక రంగాల్లో తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నామని కోరారు. ఎస్‌సిల రిజర్వేషన్ 15 శాతం, గిరిజనులకు 7 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నా ప్రత్యేక మంత్రిత్వశాఖలను ఏర్పాటు చేశారని, 27 శాతం రిజర్వేషన్‌ను పొందుతున్న బిసిలకు మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే అనేక రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖలను ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా బిసిలకు జాతీయస్థాయిలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, ఆ దిశగా ప్రధాని మోడీ వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

న్యాయం జరిగేలా చూస్తా

- వరంగల్ రైతు గట్ల సురేందర్‌కు బండి సంజయ్ హామీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

న్యాయం జరిగేలా చూస్తానని వరంగల్ రైతు గట్ల సురేందర్‌కు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ హామీనిచ్చారు. అధికార పార్టీ నేతల అండతో తన భూమిని కబ్జా చేసి, తనను చంపేందుకు కుట్ర చేస్తున్న తన సోదరుడి బారి నుంచి కాపాడాలంటూ వరంగల్ జిల్లా పొనకల్‌కు చెందిన రైతు పొట్ల సురేందర్... బండి సంజయ్‌ను ఆదివారం కలిశారు. ఆయన ఐదోజులుగా హైదరాబాద్‌లో నాగలిపట్టిన ఫ్లెక్సీతో అర్ధ నగ్నంగా తిరుగుతూ సిఎం, మంత్రులు, డిజిపిని కలిసేందుకు ప్రగతి భవన్, డిజిపి కార్యాలయం సహా మంత్రుల చాంబర్ల చుట్టూ తిరుగుతున్న విషయం తెలిసిందే.

తన పొలం తనకు ఇవ్వకపోగా, రెండుసార్లు చంపేందుకు యత్నించారనీ, దాడి చేశారని బండి ఎదుట వాపోయారు. పోలీసులను, మంత్రులను ఆశ్రయించినా న్యాయం జరగలేదన్నారు. 'బాధపడొద్దు. నీకు అండగా ఉంటా. న్యాయం జరిగేలా కృషిచేస్తా' అని భరోసా ఇచ్చారు. వెంటనే సదరు రైతు పక్షాన న్యాయ పోరాటం చేయాలంటూ లీగల్ టీంకు బాధ్యతలు అప్పగించారు.

ప్రేమజంట ఆత్మహత్య

- హాజీపూర్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. దొనబండ గ్రామ పంచాయతీకి చెందిన నాగవెల్లి శ్రీకాంత్ (24) ఆటో నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. అదే గ్రామానికి చెందిన నరెడ్ల సంఘవి (21), శ్రీకాంత్ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయాన్ని ఇరు కుటుంబాల పెద్దలకు చెప్పారు. కులాలు వేరైనప్పటికీ వివాహం జరిపించేందుకు వారు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆర్థిక సమస్యలతో అప్పులు పెరగడంతో శ్రీకాంత్ మనస్తాపానికి గురై ఈ నెల 17న సాయంత్రం గుడిపేట ఎల్లంపల్లి ప్రాజెక్టు దారిలోని పోచమ్మ గుడి వద్ద పురుగుల మందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రియురాలు సంఘవి కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వారిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా ఆదివారం సాయంత్రం శ్రీకాంత్, రాత్రి సంఘవి మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధికి సంక్షేమ పథకాలు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని గిరిజనులు, ఆదివాసీల సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి కెసిఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం వరంగల్, హనుమకొండలో బంజారా ఆత్మీయ సమ్మేళనం, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు.

రాష్ట్రంలో ఐదు వందల జనాభా దాటిన 2 వేల 471 గిరిజన తండాలను, ఆదివాసీ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారని వెల్లడించారు. 'మా గూడెంలో మా రాజ్యం- మా తండాలో మా పాలన' కావాలనే గిరిజన ఆదివాసి బిడ్డల కలను సాకారం చేశారని అన్నారు. గిరిజన గ్రామ పంచాయతీల ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున రూ.600 కోట్ల నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు.

రోడ్డు కనెక్టివిటీ లేని గిరిజన అవాసాలకు బిటి రోడ్లను మంజూరు చేశారని వివరించారు. గిరిజన విద్య కోసం తెలంగాణ రాష్టంలో 322 ఆశ్రమ పాఠశాల ద్వారా 88 వేల 233 మంది పిల్లలకు పాఠశాల విద్యను, వసతిని అందిస్తున్నామని తెలిపారు. గిరిజన రిజర్వేషన్ పెంచినందు వల్ల గిరిజన విద్యార్థులకు ఇంజినీరింగ్ సీట్లు 3,195, మెడికల్ సీట్లు 189 లభిస్తాయని అన్నారు. గ్రూప్ 1, గ్రూప్ 2, ఇతర డిపార్ట్‌మెంట్ లలో సుమారు 903 పోస్టులు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అధనంగా వస్తున్నాయని తెలిపారు. గిరిజనుల సంస్కృతిని, సంప్రదాయాలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, బంజారా సంఘాల నాయకులు, ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సీరం ఇన్ స్టిట్యూట్

- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరోనా సమయంలో కోవిషీల్డ్ వ్యాక్సిన్‌ను అందించి పేరుగాంచిన సీరం ఇన్‌స్టిట్యూట్ అంటువ్యాధులు, మహమ్మారులను ఎదుర్కొనేందుకు ఉద్దేశించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పింది. నగరంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రాంగణం నుంచి ఇది సేవలందించనుంది. సీరం ఇన్ స్టిట్యూట్ ప్రపంచంలోనే వ్యాక్సిన్ల తయారీలో అగ్రగామి. ఈ సంస్థ పోలియో, డిఫ్తీరియా, టెటానస్, పెర్టస్సిస్, హిబ్, బిసిడి, ఆర్-హెపటైటీస్ బి, మీజిల్స్, రుబెల్లా, కోవిడ్-19 తదితర వ్యాధులకు వ్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తున్నది. సీరం వ్యాక్సిన్లను దాదాపు 170 దేశాలు తమ జాతీయ ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో ఉపయోగిస్తుండటం గమనార్హం. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ సీరం సంస్థ సిఇఒ పూనవాలాతో సమావేశమై చర్చించారు. దీని ఫలితంగా ఇప్పటికే ప్రపంచ వ్యాక్సిన్ల రాజధానిగా పేరుగాంచిన హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పూనవాలా మాట్లాడుతూ ప్రజారోగ్య విద్య, అంటువ్యాధుల పర్యవేక్షణ, స్థానిక ఆరోగ్య సంరక్షణలతో సమన్వయం, మహమ్మారితో ప్రభావితులైన కుటుంబాలకు సరైన సమాచారమివ్వడం, అంతిమంగా రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం ఇవ్వడం లక్ష్యంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను తీసుకువచ్చినట్టు తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రొఫెసర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మహమ్మారులను ఎదుర్కొనేందుకు తగిన రీతిలో సిద్ధపడేందుకు ఈ సెంటర్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

- బహుళ అంతస్థుల భవనాలు, పరిశ్రమలలో ప్రమాదాలపై చైతన్య కార్యక్రమాలు
- అగ్నిమాపక శాఖాధికారుల కార్యాచరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలలో అవగాహన పెంచడానికి అగ్నిమాపక శాఖ ప్రత్యేక కార్యాచరణను చేపడుతోంది. ముఖ్యంగా, హైదరాబాద్‌తోపాటు రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్లు, ఇతర పట్టణాల్లో బహుళ అంతస్థుల భవనాలు, పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇటీవలన సికింద్రాబాద్, పురాణాపూల్, మలక్‌పేట్, కూకట్‌పల్లిలలో భారీ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం, వాటిని ఆర్పడానికి పదికిపైగా అగ్నిమాపక శకటాలు నిర్విరామంగా పని చేసి మంటలను ఆర్పేందుకు కృషి చేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. వీటన్నిటికీ అగ్ని ప్రమాదాల పరంగా ఆయా సంస్థలు తగిన నివారణా చర్యలు చేపట్టకపోవడం, ముందు జాగ్రత్త చర్యగా అగ్నిమాపక పరికరాలను నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోకపోవడమేనని అధికారులు తేల్చారు. ఈ నేపథ్యంలో అగ్ని మాపకాలకు ఆస్కారమున్న పరిశ్రమలు, బహుళ అంతస్థుల భవనాలు, ఆస్పత్రులలో అవగాహనా కార్యక్రమాలను అగ్నిమాపక శాఖ అధికారులు చేపడుతున్నారు. అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం ఆయా బహుళ అంతస్థుల భవనాలు, ఆస్పత్రులలోని వాటర్ సంపులలో నీటి నిల్వలు ఉంచుతున్నారా? లేదా మొదలుకొని ప్రతి అంతస్థులో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేస్తున్నారా? లేదా? అనే నిబంధనలపైన అగ్నిమాపక శాఖాధికారులు దృష్టిని కేంద్రీకరిస్తున్నట్టు తెలిసింది. బహుళ అంతస్థుల భవనాలలో ప్రమాదాలు జరిగితే అందులో ఉన్నవారు సురక్షితంగా వెలుపలికి వచ్చే విధంగా అవుటర్ స్టేర్ కేస్‌లను నిర్మించారా? లేదా అన్నది కూడా అధికారులు పరిశీలించబోతున్నట్టు తెలిసింది. వీటితో పాటు మరికొన్ని కీలకమైన నిబంధనలు కూడా బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తున్న బిల్డర్లు పాటిస్తున్నారా? లేదా ? అన్నది పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈ విషయమై రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై. నాగిరెడ్డి అధికారులతో సమావేశమై చర్చించినట్టు తెలిసింది. దీనికి సంబంధించిన కార్యాచరణను కొన్ని ప్రాంతాల్లో ఫైర్ సర్వీసు అధికారులు ప్రారంభించారు.



ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంబర్‌పేట పోలీస్ గ్రౌండ్స్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు ఆదివారం ఆందోళనకు దిగారు. హైకోర్టు ఆదేశాల మేరకు రీ మెజర్‌మెంట్స్ కోసం అభ్యర్థులను అంబర్‌పేట గ్రౌండ్‌కు సెలక్షన్ కమిటీ పిలిపించింది. గతంలో వచ్చిన ఎత్తు కంటే రీ మెజర్‌మెంట్స్‌లో తక్కువ వచ్చిందంటూ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. డిజిటల్ మీటర్ ద్వారా తమ ఎత్తును తక్కువ చేసి చూపించి డిస్‌క్వాలిఫై చేస్తున్నారని ఆరోపించారు. మ్యాన్యువల్‌గా ఎత్తు చెక్ చేయాలని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ సెలక్షన్ కమిటీ పట్టించుకోవడం లేదని, తమకు మెయిన్స్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

విక్రయానికి ల్యాండ్‌పార్సెల్స్

- మూడు జిల్లాల పరిధిలో అమ్మకానికి 39 పార్సెల్స్
- కనీస ధరల్లో 121 గజాల నుంచి 10,164 గజాల స్థలాలు
- రేపటి నుంచి ప్రిబిడ్ సమావేశాలు
- మార్చి 1న ఇ - ఆక్షన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా నగర శివారు ప్రాంతాల్లో ఉన్న ల్యాండ్ పార్సిల్స్ (ప్లాట్లు)ను మార్కెట్ రేటుపై ప్రజానీకానికి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు లోబడి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఎ) ల్యాండ్ పార్సెల్స్(ప్లాట్లు)ను పారదర్శకంగా ఆన్‌లైన్ పద్ధతిలో వేలం ద్వారా అమ్మకానికి పెట్టింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీ ఈ వేలం ప్రక్రియను నిర్వహించనుంది. మధ్యతరగతి ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, డెవలపర్లు ఈ ల్యాండ్ పార్సిల్స్ కొనుగోలుకు ఆసక్తి కనబస్తున్నారు.

39 ల్యాండ్ పార్సెల్స్

ప్రస్తుతం అందుబాటులో మూడు జిల్లాల పరిధిలో అవుటర్ రింగ్ రోడ్డు (ఒఆర్ఆర్)కు దగ్గరలో అమ్మకానికి 39 ల్యాండ్ పార్సెల్స్ ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో పది, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఆరు, సంగారెడ్డి జిల్లాలో 23 ల్యాండ్ పార్సిల్స్ విక్రయానికి సిద్దంగా ఉన్నాయి.

ఈ ప్రాంతాలను (ల్యాండ్ పార్సిల్స్) కేఎంఎల్ ఫైల్ ద్వారా చూసుకునే సదుపాయం ఉంది. అందుబాటు ధరల్లో 121 గజాల నుంచి 10,164 గజాల వరకు స్థలాలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలోని గండిపేట మండలంలో మూడు, శేరిలింగంపల్లి మండలంలో ఐదు, ఇబ్రహీంపట్నం మండలంలో రెండు చోట్ల ల్యాండ్ పార్సెల్స్ ఉండగా, మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలంలో నాలుగు, ఘట్‌కేసర్ మండలంలో ఒకటి, బాచుపల్లి మండలంలో ఒకటి చొప్పున ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ మండలం పరిధిలో 16, అంసీపురం మండలంలో ఆరు, జిన్నారం మండలంలో ఒకటి చొప్పున ల్యాండ్ పార్సిల్స్ ఉన్నాయి. మార్చి 1న 39 ల్యాండ్ పార్సిల్స్‌ను ఎంఎస్‌టీసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించడానికి హెచ్ఎండిఎ సన్నాహాలు చేస్తోంది. వంద శాతం ఎటువంటి చిక్కులు లేని, క్లియర్ టైటిల్ ఉన్న ఈ ల్యాండ్ పార్సెల్స్‌ను కొనుగోలు చేసిన వారు సత్వరమే భవన నిర్మాణ అనుమతులు పొందడానికి అవకాశం ఉంది. ఆన్‌లైన్ వేలంలో పాల్గొనడానికి వీలుగా ఈనెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టిసిలో రిజిస్ట్రేషన్ (నమోదు) చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్టర్ అయిన వారందరూ మరుసటి రోజు ఫిబ్రవరి 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల గడువులోపు నిర్దేశించిన ఇఎండి రుసుమును చెల్లించాల్సి ఉంటుందని హెచ్ఎండిఎ వెల్లడించింది.

రేపటి నుంచి ప్రి బిడ్ సమావేశాలు

హెచ్ఎండీఏ వేలం వేస్తున్న ల్యాండ్ పార్సిల్స్‌పై కొనుగోలుదారులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం నుంచి ప్రి బిడ్ సమావేశాలు నిర్వహిస్తుంది. 21న రంగారెడ్డి జిల్లా ల్యాండ్ పార్సిల్స్‌పై శేరిలింగంపల్లి జోనల్ ఆఫీసులో, 22న సంగారెడ్డి జిల్లా ల్యాండ్ పార్సిల్స్‌పై అర్‌సీపురంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో, 23న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ల్యాండ్ పార్సిల్స్‌పై ఉప్పల్ స్టేడియం వద్ద గల సర్కిల్ ఆఫీస్‌లో ప్రీబిడ్ మీటింగ్స్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.